సాక్షి శ్రీకాకుళం

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



సైకిల్‌పై కనకదుర్గమ్మ దర్శనానికి..

నరసన్నపేట: సోంపేట, పలాసలకు చెందిన రవికుమార్, దుర్గారావు, శంకరరావులు సైకిల్‌పై విజయవాడ కనక దుర్గమ్మ దర్శనానికి బయల్దేరారు. తోటి భవానీల సన్నిధానాల్లో రాత్రి బస చేసి పొద్దున ప్రయాణం సాగిస్తున్నామని చెప్పారు.



నిర్లక్ష్యపు నీడలో..

సాగునీటి చెరువులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. నిర్లక్ష్యంలో మగ్గిపోతున్నాయి.

- IIలో



వరద నీటిలో వాహనంతో ఇక్కట్లు

న్యూస్‌రీల్

నరసన్నపేటలో 'కన్యా కుమారి'



కోమర్తిలో స్థానికులతో హీరోయిన్ గీత్ సైనీ

నరసన్నపేట: కన్యాకుమారి సినిమా హీరోయిన్ గీత్ సైనీ బుధవారం నరసన్నపేట మండలంలో పలు గ్రామాల్లో సందడి చేశారు. మడపాం, కోమర్తి, దేవాది తదితర గ్రామాల్లో తిరిగారు. స్థానికులతో మాట్లాడి కన్యాకుమారి సినిమా గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గీత్ సైనీ మాట్లాడుతూ కన్యాకుమారి సినిమాలో నటించేందుకు అవకాశం రావడం, అదీ శ్రీకాకుళం ప్రాంతంలో తీయడం సంతోషంగా ఉందన్నారు. సినిమా ఓటీటీలో ట్రెండింగ్‌లో ఉందన్నారు. అమేజాన్ ప్రైమ్ వీడియోస్‌లో దేశ వ్యాప్తంగా మొదటి 10 సినిమాల్లో కన్యాకుమారి స్థానం పొందిందన్నారు. అలాగే ఆహాలో మొదటి 5 సినిమాల్లో ఫస్ట్ స్థానంలో నిలిచిందని ఆనందంగా చెప్పారు. మడపాంలో అభయాంజనేయ విగ్రహం వద్ద పూజలు చేశారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. హీరోయిన్ తో పాటు డైరెక్టర్ సృజన్ అట్టాడ కూడా ఉన్నారు.

శ్రీకాకుళం నగరంలో డే అండ్ నైట్ జంక్షన్ నుంచి రామలక్ష్మణ్‌కు వెళ్లేదారిలో..



● దంచికొట్టిన వాన



వాన నీటిలో వాహనదారుడి అవస్థ

దుకాణంలోకి చేరిన వర్షపు నీరు



శ్రీకాకుళం నగరంలో బుధవారం సాయంత్రం వర్షం బీభత్సం సృష్టించింది. సాయంత్రం 6 గంటల నుంచి ఏడు గంటల వరకు భారీ వర్షంతో పాటు తీవ్రమైన ఈదురు గాలులు వీచా యి. 5 గంటల వరకు వాతావరణంలో ఎలాంటి మార్పు లేకపోగా, అనూహ్యంగా ఒక్కసారిగా భారీ వర్షం పడింది. ఓ పక్క ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో నగరమంతా దద్దరిల్లిపోయింది. వాహనాలపై కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో ఎక్కడికి అక్కడ ఆటోలు ద్విచక్ర వాహనాలు నిలిచి పోయాయి. నగరంలోని రోడ్లన్నీ మోకాళ్ల లోతు నీళ్లతో నిండిపోయాయి. –శ్రీకాకుళం

● ఆడుదామా.. దాండియా

కోయ నృత్యం చేసినా.. కోలాటం ఆడినా అన్నీ అమ్మ కోసమే. డప్పు దరువేసి గెంతినా, దాండియా నృత్యం చేసినా అన్నీ ఆ తల్లి దయ కోసమే. జిల్లా కేంద్రంలోని అమ్మవారి మండపాల వద్ద మన సంప్రదాయ నృత్యాలతో పాటు దాండియా నృత్యాలు కూడా కనిపిస్తున్నాయి. ఈ అపురూప సంప్రదాయ నృత్య సంగమాలతో నవరాత్రుల శోభ మరింత పెరుగుతోంది.

- దసరా వేడుకల్లో దాండియా నృత్యాలు
- పదేళ్లుగా జిల్లా కేంద్రంలో నవరాత్రి వేడుకలు చేస్తున్న రాజస్థానీలు
- కుటుంబ సమేతంగా నృత్యాలతో సందడి



శ్రీకాకుళం టౌన్‌హాల్ ప్రాంగణంలో దాండియా ఆడుతున్న మహిళలు



శ్రీకాకుళం కల్చరల్ : జిల్లా కేంద్రంలో రాజస్థానీలు తమదైన శైలిలో దసరా ఉత్సవాలు చేస్తున్నారు. గత పదేళ్లుగా వారు ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. స్థానిక టౌన్‌హాల్‌ను వేదికగా ఏర్పాటు చేసుకొని అమ్మ వారి చిత్రపటాన్ని పెట్టి రోజూ దాండియా ఆడుతారు.

దాండియా కోసం..

దాండియా అనేది మన కోలాటంలాగానే ఉంటుంది. ఈ దాండియా గుజరాత్ రాష్ట్రంలో ఉద్భవించిన జానపద నృత్యం. నవరాత్రి పండగలో ప్రసిద్ధి చెందింది. రాజస్థాన్‌లో కూడా మార్వార్ ప్రాంతంలో ప్రదర్శింపస్తుంటారు. ఈ నృత్యంలో పోటీలు, సంప్రదాయ ప్రదర్శనలు ఉంటాయి. పురుషులు, స్త్రీలు సంప్రదాయ దాండియా ఆడతారు. నృత్యం జంటగా ఉంటుంది. గ్రూప్‌గా రెండు వరుసలలో ఆడతారు. గ్రూపులు సవ్యదశలో కదులుతూ మరో గ్రూపు భాగస్వామితో కలసి కర్రలను కొడుతూ కొనసాగిస్తారు. వీరు ప్రత్యేక దుస్తులను ధరిస్తారు.

9 రోజుల దసరా ఉత్సవాల్లో.

నగరంలోని రాజస్థాన్ కుటుంబ సభ్యులంతా కలసి దసరా నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గా పూజలు చేయడం, హారతులు ఇవ్వడం ఆనవాయితీ. పూజల అనంతరం వారి ఆచారంగా దాండియా నృత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. 9 రోజులు టౌన్‌హాలులో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల వెలుగుల మధ్య ఉత్సాహంగా దాండియా ఆడి సందడి చేస్తున్నారు.

సంప్రదాయం కొనసాగిస్తున్నాం..



ఎన్నో ఏళ్లుగా మా పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయం కొనసాగాలి. నగరంలో పదేళ్లుగా దసరా ఉత్సవాల సందర్భంగా మా సంప్రదాయ పూజలు చేస్తాం. దాండియా ఆడడం మా ప్రత్యేకత.

– రాజేంద్ర కర్నాని, వ్యాపారవేత్త

ఆనందంగా ఆడుతాం



కుటుంబ సభ్యులంతా ఈ ఉత్సవాల్లో పాల్గొని దాండియా ఆడతాం. ఇదంతా ఒక ప్రత్యేక సంప్రదాయం. ప్రతి ఒక్కరూ పాల్గొంటాం. మా పిల్లలు కూడా ఆడతారు. – భగత్ సింగ్, వ్యాపారి, శ్రీకాకుళం

జల్సాలకు పోయి జైలుపాలు



విలాసాల నాగరాజు జైలు పాలయ్యాడు. ఎంబీఏ వరకు చదువుకుని.. రంజీ లెవెల్‌లో క్రికెట్ ఆడి.. జల్సాలకు మరిగి మోసాలకు పాల్పడడం మొదలుపెట్టిన నాగరాజు గంజాయి కేసులో దొరికిపోయాడు. కోర్టు అతడికి నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది.

-II లో

ప్రయాణానికి ప్రయాసలు..!



ప్రయాణికులు బుధవారం ప్రయాస పడ్డారు. 37 బస్సులు డీఎస్సీ వారి కోసం వెళ్లిపోవడం, టెక్కలిలో కొత్తమ్మ తల్లి జాతర జరుగుతుండడం, దసరా సెలవులు కావడంతో కాంప్లెక్స్‌కు జనం పోటెత్తారు. బస్సులు సరిపోక నరకం చూశారు.



వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

● వైఎస్ జగన్‌ను కలిసిన జిల్లా నాయకులు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పార్టీ జిల్లా నాయకులు తాడేపల్లిలో బుధవారం కలిశారు. పార్టీ విస్తృత స్థాయి సమావేశం అనంతరం వారు వైఎస్ జగన్‌ను కలిసి జిల్లాలో పార్టీ పరిస్థితుల గురించి వివరించారు. –నరసన్నపేట



సమావేశానికి హాజరైన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

● ఆ రూపం.. అపురూపం



అన్నపూర్ణదేవిగా పాతపట్నం నీలమణి దుర్గ



చంద్రఘంట అలంకరణలో ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారు



శ్రీకాకుళంలో కనక దుర్గమ్మ

అలంకరణలు కొనసాగుతున్నాయి. అర్చనలు జరుగుతున్నాయి. ఉత్సవాలు ఉత్సాహంగా కనిపిస్తున్నాయి. శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారు రోజుకో రూపంలో దర్శనమిస్తున్నారు. అపురూప అలంకరణలను తిలకించి భక్తజనం పులకిస్తున్నారు.

● దసరా ప్రత్యేక బస్సులు 480

- దూరప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు
- సాధారణ చార్జీలతోనే గమ్యస్థానాలకు
- రాను, పోను టికెట్‌లు బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ
- ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు



శ్రీకాకుళం అర్బన్: దసరా సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులు నడపనుంది. జిల్లాలోని శ్రీకాకుళం-1, శ్రీకాకుళం-2, టెక్కలి, పలాస తదితర నాలుగు డిపోల నుంచి 480 ప్రత్యేక బస్సులను నడపనుంది. ఈ నెల 28వ తేదీ నుంచి అక్టోబరు 6వ తేదీ వరకూ ఈ సర్వీసులు నడపనున్నారు. అందుకు తగ్గట్లుగా ఆర్టీసీ అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. దసరా పండగ సందర్భంగా ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబరు 2వ తేదీ వరకూ స్కూళ్లకు, ఈనెల 28వ తేదీ నుంచి అక్టోబరు 5వ తేదీ వరకూ కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో అందుకు తగ్గట్లుగా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. పండగ ముందు బస్సులు, పండగ తర్వాత తిరుగు ప్రయాణ రద్దీని దృష్టిలో పెట్టుకుని బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దూరప్రాంత ప్రయాణికులు తమ టికెట్లను ఆన్‌లైన్‌లో ముందుగానే రిజర్వేషన్ చేయించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక బస్సులు ఇలా..

దసరా పండగ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా నుంచి దూరప్రాంతమైన విజయవాడకు 7 బస్సులు నడుస్తున్నాయి. అలాగే టెక్కలి నుంచి రాజమండ్రికి 5 బస్సులు, కాకినాడ నుంచి పాతపట్నంకు 2 బస్సులు, టెక్కలి నుంచి అమలాపురానికి 3 బస్సులు నడుస్తున్నాయి. అలాగే శ్రీకాకుళం నుంచి విశాఖకు 25 అల్ట్రా డీలక్స్, 11 అల్ట్రా పల్లెవెలుగులు, 8 పల్లెవెలుగు బస్సులు తిరుగుతున్నాయి. ప్రస్తుతం శ్రీకాకుళం నుంచి విశాఖపట్టణంకు ప్రతి 5 నిమిషాలకు ఒక నాన్‌స్టాప్ బస్సు అందుబాటులో ఉండగా ప్రత్యేక బస్సులతో కలిపి ప్రతి 2 నిమిషాలకు ఒక నాన్‌స్టాప్ బస్సు నడవనుంది.

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఇంకా అదనపు బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

10 శాతం రాయితీ

ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణీకులకు ఎప్పటిలాగే బంపర్ ఆఫర్ ప్రకటించింది. దసరా పండగ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు ముందస్తుగా టికెట్ రిజర్వేషన్ చేయించుకుంటే ప్రయాణ చార్జీలో 10శాతం రాయితీ ఇస్తున్నారు. ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించేవారు రాను, పోను టికెట్ తీసుకుంటే 10శాతం రాయితీ ఇస్తున్నారు.

రద్దీకి తగ్గట్టుగా సర్వీసులు



దసరా పండగను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల రద్దీకి తగ్గట్లుగానే ఆర్టీసీ బస్సులు నడుపుతాం. దూర ప్రాంతాల నుంచి శ్రీకాకుళంకు, తిరుగు ప్రయాణ సమయంలో శ్రీకాకుళం నుంచి దూరప్రాంతాలకు వెళ్లే ప్రత్యేక బస్సుల్లో ఎలాంటిటి అదనపు చార్జీలు ఉండవు. ప్రయాణికులు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. – సీహెచ్ అప్పలనారాయణ, డీపీటీఓ



కొత్తమ్మ తల్లి జాతరకు హాజరైన జనసందోహం

● జజ్జనకరి జాతర



కొత్తమ్మ తల్లి

కొత్తమ్మ తల్లి శతాబ్ది ఉత్సవాల్లో బుధవారం నిర్వహించిన శోభాయాత్ర, సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేశాయి. శోభాయాత్ర కొత్తపేట కూడలి నుంచి కోటబొమ్మాళి వరకు అంగరంగ వైభవంగా సాగింది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తదితరులు విజయ ఢంకా మోగించి శోభాయాత్ర, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. పలు రకాల సంప్రదాయ నృత్యాలు అలరించాయి. విద్యుత్ వెలుగులతో కొత్తమ్మ తల్లి ఆలయం నేత్రపర్వంగా మెరిసింది. జిల్లా పోలీసుల సమన్వయంతో ప్రజల సహకారంతో కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాలు ఎలాంటి అవాంతరాలు లేకుండా శాంతియుతంగా జరుగుతున్నాయని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు.

– టెక్కలి/ శ్రీకాకుళం క్రైమ్



ఢంకా మోగిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శోభాయాత్రలో ఘటాలతో మహిళలు

క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో బుధవారం మత పెద్దలు, కుల పెద్దలతో బాల్య వివాహాలు – అనర్థాలు – చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన కొన్ని సామాజికవర్గాల్లో ఇంకా బాల్య వివాహాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన ఆడ పిల్లలకు అనే అనారోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లలను చదివించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచిస్తూ, బాల్య వివాహాల నివారణ కోసం ప్రభుత్వ పథకాలను వివరించారు. ఇలాంటి సమస్యలు ఎదురైతే 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయడం లేదా స్థానిక జిల్లా కోర్టు భవనంలోని న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న వివిధ మత పెద్దలు, కె.రమణ (ఐసీపీఎస్), జి.ఇందిరాప్రసాద్ (అడ్వకేట్), కె.ఆఫీసు నాయుడు (చీఫ్ ఎల్ఏడీసీ) తదితరులు పాల్గొన్నారు.

'మాన్యువల్ పద్ధతిలో ప్లేసులు కేటాయించాలి'

శ్రీకాకుళం: డీఎస్సీ–2025 అభ్యర్థులకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా ప్లేసులు కేటాయించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్వీ రమణ మూర్తి, జి.రమణ ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. చాలామంది ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌పై అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా క్లస్టరు వేకెన్సీల గురించి పూర్తి సమాచారం ఇవ్వకుండా అప్పటి అధికారులు వెబ్ కౌన్సిలింగ్ పేరిట దూరం ప్లేసులు కేటాయించారని ఇప్పటికీ ఆవేదన చెందుతూనే ఉన్నారని, కాబట్టి డీఎస్సీ 2025 అభ్యర్థులందరికీ మాన్యువల్ పద్ధతిలోనే ప్లేసులు కేటాయించాలని తెలియజేశారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న సామగ్రితో ఎక్సైజ్ అధికారులు

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో అక్రమంగా నిర్వహిస్తున్న నాటుసారా తయారీ స్థావరాలపై ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా బుధవారం దాడులు నిర్వహించారు. పాతపట్నం, కొత్తూరు మండలాలకు ఆనుకుని ఉన్న ఒడిశా గ్రామాలైన సింగిపూర్, నేరేడి గూడ, శిరడా, గురిసింగిగూడ, దిదింగూడ పరిసరాల్లో 720 లీటర్ల నాటుసారా, 6,800 లీటర్ల తయారీకి సిద్ధంగా ఉంచిన పులియబెట్టిన బెల్లపు ఊటలను గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే భారీగా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పాతపట్నం ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. సారా తయారీ, విక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. దాడుల్లో శ్రీకాకుళం అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు, సూపరింటెండెంట్లు మురళీ, కుమార్, ఒడిశా రాష్ట్రం, గజపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహు, జిల్లా టాస్క్‌ఫోర్స్ పాతపట్నం, టెక్కలి, పలాస, ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి, కాశీనగర్ ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలకు గురైన కొత్తూరు మండలం వసప కాలనీలోని శంకరపాత్రుని చెరువు



నిర్లక్ష్యపు నీడలో..!

- మరమ్మతులకు నోచుకోని సాగునీటి చెరువులు
- వెంటాడుతున్న నిధుల కొరత
- యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కొత్తూరు: జిల్లాలో వందలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తున్న చెరువుల బాగోగులను అధికారులు పట్టించుకోకపోవడంతో నేడు వాటి రూపం కోల్పోతున్నాయి. వర్షాలు పడితే తప్పా జిల్లాలోని చెరువుల కింద సాగు చేస్తున్న పొలాల్లో వరినాట్లు వేయలేని దుస్థితి నెలకొంది. జిల్లాలోని 30 మండలాల్లో 6,630 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు(సాగునీటి చెరువులు) ఉన్నాయి. అందులో వంద ఎకరాల ఆయకట్టుకు దాటి సాగునీరు అందిస్తున్న చెరువులు 655 ఉన్నాయి. వీటి ద్వారా జిల్లాలో ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 2.65 లక్షల ఎకరాల్లో వరి పంటకు సాగునీరు అందిస్తున్నాయి. అయితే సాగునీటి చెరువుల మరమ్మతులు, పూడికలు తీయడానికి, చెరువులు అభివృద్ధి చేయడానికి ప్రభుత్వాలు అవసరమైన నిధులు కేటాయించకపోవడంతో పూడికలు, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. అలాగే మరోవైపు ఆక్రమణలకు గురవ్వడంతో వాటి రూపం కోల్పోయాయి. దీంతో చెరువుల్లో నీటి సామర్థ్యం తగ్గి ఆయకట్టు భూములకు సాగునీరు అందకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలోని 6,630 చెరువుల్లో 9.85 టీఎంసీల నీటి సామర్థ్యం ఉండేది. అయితే చెరువులు నిర్లక్ష్యానికి గురవ్వడంతో పాటు ఆక్రమణలకు గురికావడం, పూడికలతో నిండిపోవడంతో ప్రస్తుతం నీటి సామర్థ్యం 7.52 టీఎంసీలకు తగ్గింది. దీంతో శివారు భూములకు సాగునీరు అందక.. రైతులు వర్షపు నీటిపైనే ఆధారపడుతున్నారు. వర్షాలు కురవకపోతే కొన్ని సందర్భాల్లో వరినాట్లు వేయని సందర్భాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా పంటలు పొట్టదశలో, వెన్ను దశలో ఎండిపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఉపాధి పథకం ద్వారా చెరువు పనులు చేస్తున్నప్పటికీ ఆక్రమణలు తొలగించకుండా పనులు చేస్తుడడంతో ఉపయోగం ఉండడం లేదు. అందువలన ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్లక్ష్యానికి గురైన మైనర్ ఇరిగేషన్ చెరువులకు నిధులు కేటాయించి, ఆక్రమణలు తొలగించి పూర్వ వైభవం తీసుకురావాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలతో నిండిపోయిన పద్మనాభ సాగరం

ఆక్రమణలు తొలగించాలి



తరాలు నుంచి వస్తున్న సాగునీటి చెరువులు పలు గ్రామాల్లో ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో ఆయకట్టు భూములకు సాగునీరు సక్రమంగా అందడం లేదు. దీంతో వరిపంట సాగుకు వర్షాలపై ఆధారపడుతున్నాము. ఆక్రమణలు తొలగించి చెరువులకు పూర్వ వైభవం తీసుకు రావాలి.

– గార రాజులునాయుడు, మాకవరం, కొత్తూరు మండలం

రూ.200 కోట్లతో ప్రతిపాదనలు

జిల్లాలోని 663 ఎంఐ ట్యాంకుల అభివృద్ధి కోసం ఆర్‌ఆర్‌ఆర్ కమిటీ ద్వారా కలెక్టర్ పర్యవేక్షణలో రూ.200 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేస్తున్నాము. నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి పంపిస్తాము. నిధులు మంజూరైన వెంటనే చెరువుల్లో పనులు జరగడం జరుగుతుంది.

– పొన్నాడ సుధాకరరావు, మైనర్ ఇరిగేషన్ ఇన్‌చార్జి ఎస్ఈ, శ్రీకాకుళం జిల్లా

నిర్లక్ష్యానికి గురయ్యాయి



సాగునీటి చెరువులు నిర్లక్ష్యానికి గురికావడంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందడం లేదు. బలద గ్రామానికి చెందిన సుమారు 89 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పద్మనాభ సాగరం సుమారు 525 ఎకరాలకు సాగు నీరు అందిస్తుంది. అటువంటి ఈ చెరువు పూడికలు, పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో పాటు ఆక్రమణకు గురయ్యింది. అధికారులు స్పందించి చెరువులో పూడికలు తీయడానికి నిధులు కేటాయించాలి. – బీవీ రమణమూర్తి, బలద గ్రామం, కొత్తూరు మండలం

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ అధికారి సుధాకర్

ఎచ్చెర్ల: బీఆర్ఏయూలో ఎన్ఎస్ఎస్ 57వ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డా.ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సేవాభావం, సామాజిక బాధ్యత, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు అందించేది ఎన్ఎస్ఎస్ మాత్రమేనన్నారు. ప్రతీ విద్యార్థి ఎన్ఎస్ఎస్‌లో భాగస్వామ్యం కావడం ద్వారా దేశ ప్రగతికి ఊతమిచ్చినట్లవుతుందని అభిప్రాయపడ్డారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.అడ్డయ్య, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, నెహ్రూ యువకేంద్రం ఉప సంచాలకుడు కె.వెంకట ఉజ్వాల్, బెజ్జిపురం యూత్‌క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు, ఎన్ఎస్ఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ డా.డి.వనజ తదితరులు మాట్లాడుతూ.. 1969లో గాంధీజీ శత జయంతోత్సవాల సందర్భంగా దేశంలోని 37 వర్సిటీల్లో ప్రారంభమైన ఎన్ఎస్ఎస్ సేవలు.. నేడు అన్ని వర్సిటీలు, కాలేజీల్లో విస్తృతమయ్యాయన్నారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక చైతన్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ప్రగతిదాయక కార్యక్రమాలకు వాలంటీర్లు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్స్ డా.ఎం.అనూరాధ, డా.సీహెచ్.రాజశేఖరరావు తదితరులు కూడా మాట్లాడారు. జిల్లాస్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఈ కార్యక్రమంలో ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. అదేవిధంగా జిల్లా, వర్సిటీ స్థాయిలో ఎంపిక చేసిన పదిమంది ఎన్ఎస్ఎస్ పీవోలకు ఉత్తమ అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. అలాగే వర్సిటీలో ఏడు యూనిట్ల పీవోలకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. అంతకుముందు నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

వి-జ్యూయలరీ మార్ట్ రెండో షోరూమ్ ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న కె.ఎస్.వి.ఎస్.గురుమూర్తి

బీచ్‌రోడ్డు: ఆశీలమెట్ట సంపత్ వినాయగర్ ఆలయ సమీపంలో వి–జ్యూయలరీ మార్ట్ రెండో షోరూమ్‌ను శ్రీకన్య ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్.వి.ఎస్.గురుమూర్తి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వి–జ్యూయలరీ మార్ట్ భాగస్వాములు కోలా బాబురావు, కాకి గంగరాజు, పట్నాల శ్రీనివాసరావు, వూన వినీత్ మాట్లాడుతూ విమార్ట్ ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని రకాల 22 క్యారెట్ బంగారు ఆభరణాలను గ్రాము రూ.9,987 చొప్పున తరుగు 6.96 శాతం నుంచి పొందవచ్చన్నారు. అలాగే సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదని, జీఎస్టీని కస్టమర్ తరుపున తామే చెల్లిస్తామన్నారు. కేజీ వెండి వస్తువుల కొనుగోలుపై రూ.15,000 వరకు తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ ఆఫర్ కొన్ని రోజులు మాత్రమే ఉంటుందన్నారు.

దొంగలను పట్టించిన రోడ్డు ప్రమాదం

- పోలీసుల అదుపులో నిందితులు



మేకలు దొంగతనం చేసిన నిందితులు

పలాస/శ్రీకాకుళం క్రైమ్: పలాస మండలంలోని మోదుగులపుట్టి గ్రామానికి చెందిన అవుగాన పార్వతీశం, అవుగాన రమణలకు చెందిన సుమారు రూ.1.5 లక్షల విలువైన పెద్ద మేకపోతులను సోమవారం రాత్రి దొంగతనం చేశారు. మోదుగులపుట్టి సమీపంలోని కొత్తపేటలో మేకల మందను వేయగా.. రాత్రిపూట మంద వద్దకు వెళ్లిన నలుగురు వ్యక్తులు దొంగతనం చేసి ఎత్తుకుపోయారు. మోదుగులపుట్టి గ్రామస్తులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. కోసంగిపురం జగనన్న కాలనీ సమీపంలో ఉన్న సోంపేట మండలం గొల్లూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి, పలాస మండలం అనంతగిరి గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో పాటు మరో ఇద్దరు దొంగతనం చేశారు.

ప్రమాదం జరగడంతో...

మేకలను దొంగిలించిన నలుగురు యువకులు కారులో శ్రీకాకుళం నగరానికి తీసుకెళ్లి అమ్మేశారు. తిరుగు ప్రయాణంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పోలీసులకు పట్టుబడడంతో విచారణలో అసలు విషయం బయటకొచ్చింది. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పలాస మండలంలో మేకలు దొంగతనం చేసిన కె.సాయికుమార్, కె.గణేష్, ఎం.వంశీ, ఎల్.ఛత్రపతిలు ఐదు మేకలను దొంగిలించి, కారులో ఎక్కించి నగరంలోని గుజరాతీపేటలో మటన్ షాపు నిర్వాహకుడికి తక్కువ ధరకు అమ్మేశారు. అనంతరం తిరుగు ప్రయాణంలో హయాతీనగరం వచ్చేసరికి కారు అదుపుతప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొన్నారు. అప్పటికే అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి విషయం పూర్తిగా తెలిసినా డ్రంక్ అండ్ డ్రైవ్‌తో సరిపెట్టేద్దామనుకున్నారు. సమాచారం ప్రత్యేక విభాగ పోలీసులకు అందడంతో చేసేదేమీలేక ట్రాఫిక్ పోలీసులు ఒకటో పట్టణ పోలీసులకు యువకులను అప్పగించారు. దీంతో ఎస్ఐ ఎం.హరికృష్ణ యువకులను ప్రశ్నించగా అసలు విషయాలు బయటకొచ్చాయి. ఎప్పటినుంచో నగరంలోని ఏడురోడ్ల కూడలి సమీపంలో మంచి పేరున్న మటన్ షాపు నిర్వాహకుడి కుమారుల్లో ఒకరైన రాజు (గుజరాతీపేట షాపునకు) వద్దకు వెళ్లి తక్కువ ధరకు అమ్మారని తెలిసింది. గతంలో కూడా రూరల్ మండలం పాత్రునివలసలో రెండో పట్టణ పరిధి ఇద్దరు రౌడీషీటర్లు గొర్రెలు ఇదే నిర్వాహకుడికి అమ్మడంతో అప్పట్లో కూడా పోలీసులు ఇతడిని విచారించడం గమనార్హం. విచారణ అనంతరం కేసును కాశీబుగ్గ స్టేషన్‌కు బదలాయించినట్లు ఎస్ఐ ఎం.హరికృష్ణ వెల్లడించారు.

ప్రయాణానికి ప్రయాసలు..!

- డీఎస్సీ అభ్యర్థులతో తరలి వెళ్లిన బస్సులు
- జిల్లాలో ప్రయాణాలకు ఇబ్బందులు



కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ బుధవారం ప్రయాణికులతో రద్దీగా మారింది. జిల్లాలోని కోటబొమ్మాళిలో కొత్తమ్మ తల్లి పండగలు జరుగుతుండడం, దసరా పండగ సందర్భంగా దూరప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికులతో కిటకిటలాడింది. అయితే ప్రయాణికులకు తగ్గట్లుగా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. బస్సుల కోసం ప్రయాణికులు ఫుట్‌పాత్‌లపై వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తరలివెళ్లిన 37 ఆర్టీసీ బస్సులు

ఇటీవల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన డీఎస్సీలో సెలెక్టయిన అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం విజయవాడ రమ్మని పిలిచింది. వీరంతా ఈనెల 25వ తేదీకి హాజరవ్వాలని చెబుతూ ప్రభుత్వం ఆర్టీసీ బస్సులను వేసింది. దీంతో జిల్లా నుంచి శ్రీకాకుళం ఒకటో డిపో పరిధిలో 11 బస్సులు, శ్రీకాకుళం రెండో డిపో పరిధిలో 7 బస్సులు, టెక్కలి డిపో నుంచి 8 బస్సులు, పలాస డిపో నుంచి 8 బస్సులు, పాలకొండ డిపో నుంచి 3 బస్సులను విజయవాడకు వేశారు. దీంతో బస్సుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

సకాలంలో రాని బస్సులు

విజయవాడకు 37 బస్సులు తరలిపోవడంతో సకాలంలో ఆర్టీసీ బస్సులు రాలేదు. దీంతో ప్రయాణికులు పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. బస్సు ఎప్పుడు వస్తుందోనని ఫుట్‌పాత్‌లపై ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. వచ్చే బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు ఎగబడ్డారు. దూరప్రాంతాలకు వెళ్లేందుకు నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద బారులు తీరుతూ కనిపించారు. నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద రద్దీ అధికంగా ఉండడంతో ఆర్టీసీ అధికారులు పల్లె వెలుగు బస్సులనే నాన్‌స్టాప్ బస్సులుగా నడిపారు.

37 బస్సుల్లో 1346 మంది తరలింపు



ఆర్టీసీ సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి

శ్రీకాకుళం: జిల్లా నుంచి డీఎస్సీ 2025కు ఎంపికైన అభ్యర్థులను విజయవాడ తరలించారు. 673 మంది అభ్యర్థులు జిల్లా నుంచి ఎంపిక కాగా, వీరితోపాటు వీరికి సహాయకులుగా 673 మందిని 37 బస్సుల్లో తీసుకువెళ్లారు. స్థానిక ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల ఆవరణ నుంచి బుధవారం ఉదయం 9 గంటలకు ఈ బస్సులు బయల్దేరాయి. బస్సులను ఆర్డీఓ సాయి ప్రత్యూష జండా ఊపి ప్రారంభించారు. ప్రతి బస్సులోనూ ఓ కానిస్టేబుల్‌తో పాటు ముగ్గురు సహాయకులను పంపించారు. అభ్యర్థులతో పాటు డీఈఓ రవిబాబు, ఉప విద్యాశాఖ అధికారి విజయ కుమారి తదితరులు వెళ్లారు. వీరందరికీ గురువారం విజయవాడలో జరిగే ఓ కార్యక్రమంలో నియామక పత్రాలు అందజేస్తారు. అటు తర్వాత వీరందరికీ వెబ్ కౌన్సిలింగ్ ద్వారా పాఠశాలలను కేటాయిస్తారు.

సంతకాల సేకరణలో తలమునకలు

- జోనంకి సచివాలయం తప్పుడు ధ్రువీకరణ పత్రంపై కార్యదర్శి మల్లగుల్లాలు
- చేసిన తప్పును సరిదిద్దుకునేందుకు మరో తప్పు

జలుమూరు: జోనంకి సచివాలయ పరిధిలో దవళ అప్పలనాయుడు మరణ ధ్రువీకరణ పత్రం జారీపై సంబంధిత అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. సెలవులో ఉన్న కార్యదర్శి గుడ్ల సరోజిని డిజిటల్ సైన్‌తో ధ్రువీకరణ పత్రం జారీ కావడం కలకలం రేపింది. ఇదే అదనుగా సైబర్ క్రైమ్ కమిషనర్ అంటూ ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి సెలవులో ఉన్న కార్యదర్శి సరోజినిని బెదిరించి సుమారు రూ.1.20 లక్షలు అక్రమంగా దోచుకోవడం జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది. దీనిపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. దీంతో డిఫెన్స్‌లోకి వెళ్లిన లింగాలవలస కార్యదర్శి ఎం.లక్ష్మీ తన తప్పును కప్పి పుచ్చుకునేందుకు.. అప్పలనాయుడు విశాఖలో మృతి చెందలేదని, గ్రామంలోనే చనిపోయారని గతంలోనే నివేదిక సిద్ధం చేసుకున్నారు. తనకు కావాల్సినట్టు నివేదిక రాయించుకొని గ్రామస్తులతో సంతకాలు తీసుకుంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే టీడీపీకి అనుకూలంగా ఉన్న ఇళ్లకు వెళ్లి కొంత మందితో దర్యాప్తు నివేదికలో సంతకాలు చేయిస్తున్నారని సర్పంచ్ జీవీ రమణి ఆరోపించారు. ముందుగా అంగన్‌వాడీ కార్యకర్తను సంతకం చేయమని కోరగా ఆమె నిరాకరించారు. అలాగే గ్రామంలో మరికొందరిని సంతకాలు చేయమని ప్రాధేయపడగా కొందరు కాదంటుండగా, మరికొందరు తప్పని పరిస్థితిలో సంతకాలు చేయిస్తున్నట్లు సమాచారం.

జల్సాలకు పోయి జైలుపాలు

- గంజాయి కేసులో నాగరాజుకు జైలుశిక్ష
- తెలుగు రాష్ట్రాల్లో 25కి పైగా ఛీటింగ్ కేసులు

శ్రీకాకుళం క్రైమ్: ఎంబీఏ వరకు చదువుకుని.. రంజీ లెవెల్‌లో క్రికెట్ ఆడి.. జల్సాలకు అలవాటుపడి.. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై.. చివరికి టెక్కలి పీఎస్ పరిధి గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడైన పోలాకి మండలం యవ్వారిపేటకు చెందిన బుడుమూరు నాగరాజుకు బుధవారం శ్రీకాకుళం న్యాయస్థానం నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. జిల్లా ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జడ్జి పి.భాస్కరరావు ఈ మేరకు తీర్పు వెలువరించినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఐదున్నర కేజీల గంజాయితో పట్టుబడి..

2023 జనవరి 3న టెక్కలి సమీప జగదిమెట్ట జంక్షన్ ఎన్‌హెచ్–16 రోడ్డులో స్కూటీపై వస్తున్న నాగరాజును అప్పటి ఎస్ఐ ఎల్.రామకృష్ణ తనిఖీ చేయగా డిక్కీలో ఐదున్నర కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో నాగరాజు నుంచి స్కూటీ, రెండుఫోన్లు, ఒక బంగారం ఉంగరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని ఒడిశా రాష్ట్రం చీకటి గ్రామ అటవీ ప్రాంత రైతుల వద్ద కొనుక్కుని.. పోలాకిలో అమ్మేందుకు తెస్తుండగా పట్టుబడ్డాడు. దర్యాప్తు అధికారైన అప్పటి టెక్కలి సీఐ ఎస్ సూర్యచంద్రమౌళి (ప్రస్తుతం సీసీఎస్ సీఐ) కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేయగా, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కింజరాపు శ్రీనివాసరావు కేసు వాదించారు. బుధవారం నేరం రుజువైనందున న్యాయమూర్తి నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. జరిమానా కట్టకుంటే మరో ఆరునెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

నాగరాజుపై ఎన్‌ఫోర్స్ కేసులు

టెక్కలిలో గంజాయి కేసులో దొరికిన మూడు నెలల తర్వాతనే (బెయిల్‌పై వచ్చి) శ్రీకాకుళం నగర శివార్లలోని శీపన్నాయుడుపేట విజయాదిత్య పార్కు వద్ద 23.45 కిలోల గంజాయితో అప్పటి రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాస్‌కు పట్టుబడ్డాడు. అంతకుముందు 2022లో టెక్కలిలో 48 మద్యం బాటిళ్లతో ఎస్ఐ కామేశ్వరరావుకు, రాజాంలో గంజాయి తరలిస్తూ అక్కడి పోలీసులకు దొరికాడు.

పలు ఛీటింగ్ కేసులు

గతంలో రాజకీయ నాయకుల పీఏనంటూ పలు కంపెనీలకు ఫోన్లు చేస్తూ తన అకౌంట్లకు డబ్బులు వేయించుకున్నాడు. కేర్ ఆస్పత్రి యాజమాన్యాన్ని రూ.60 వేలు మోసగించడతో విశాఖ టూటౌన్‌లో, సెలెక్ట్ మొబైల్ ఎండీ నుంచి రూ.2.88 లక్షలు, విజయవాడ రామకృష్ణ టౌన్‌షిప్ నుంచి రూ.3.88 లక్షలు వసూలు చేసినట్లు కేసులున్నాయి. ఇలా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 25కు పైగా నాగరాజుపై కేసులుండటం విశేషం.

లిక్విడ్ లారీ బోల్తా



జి.సిగడాం: రాజాం నుంచి చిలకపాలెం వైపు వెళ్తున్న లిక్విడ్ లారీ వాండ్రంగి రైల్వే వంతెన వద్ద బుధవారం రాత్రి బోల్తా పడింది. దీంతో రోడ్డుపై ప్రయాణిస్తున్న వారు భయాందోళనకు గురయ్యారు. చీకటిలో ఆ లిక్విడ్ ఏమిటన్నది తెలియకపోవడంతో వారి ఆందోళన పెరిగింది.